సాక్షి
అనంతపురం
సోమవారం ▪ 3 ▪ జూలై ▪ 2023



సంతల ఆదాయం రూ.3 లక్షలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం జీవాలు, పశువుల సంతల ద్వారా రికార్డు స్థాయిలో రూ.3.03 లక్షల ఆదాయం ఫీజు రూపంలో వచ్చింది.



రైతు దంపతుల దుర్మరణం

బెళుగుప్ప మండలం నక్కలపల్లిలో ఆదివారం వ్యవసాయ పనులకు బయల్దేరిన రైతు దంపతులు ట్రాక్టర్ ప్రమాదంలో దుర్మరణం చెందారు.

8లో

గరిష్టం/కనిష్టం
38.1°/23.4°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

చకచకా భూముల సర్వే

భూముల రీ సర్వే ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా సాగుతోంది. జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకం కింద భూముల సమగ్ర రీ సర్వే చేపట్టారు. భవిష్యత్తులో భూముల రికార్డులను ఎవరూ తారుమారు చేయలేరు. సర్వే పూర్తవగానే హద్దురాళ్ల పాతి, భూ యజమానికి క్యూఆర్ కోడ్ ఆధారిత భూ హక్కు పత్రాలు జారీ చేస్తున్నారు.

- 'జగనన్న శాశ్వత భూ హక్కు– భూరక్ష' ద్వారా తొలిదశ 43 గ్రామాల్లో రీసర్వే పూర్తి
- రెండో దశ 57 గ్రామాల్లో పూర్తి
- హద్దురాళ్లు పాతి.. భూ హక్కు పత్రాల జారీ

అనంతపురం అర్బన్: భూ వివిదాలు/ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 'జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష' పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారు. జిల్లాలోని 31 మండలాల పరిధిలో గల 503 గ్రామాల్లో 10,188.59 చదరపు కిలో మీటర్లు సర్వే చేయనున్నారు. తొలిదశ కింద సమగ్ర సర్వే చేపట్టిన 43 గ్రామాల్లో అన్ని ప్రక్రియలను పూర్తి చేశారు. 60,575 హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. 23,947 మంది భూ యజమానులకు భూ హక్కు పత్రాలు అందజేశారు. సర్వేలో భాగంగా రెండో దశలో డ్రోన్ ఫ్లై 293 గ్రామాల్లో పూర్తయ్యింది. వీటిలో 61 గ్రామాలకు సంబంధించి ఓఆర్ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్) ప్రక్రియ పూర్తయ్యింది. ఇందులో 57 గ్రామాలకు సంబంధించి 13 నోటిఫికేషన్లు జారీ చేశారు. అదే విధంగా గ్రౌండ్ ట్రూతింగ్ దశ, గ్రౌండ్ వాలిడేషన్ దశ పూర్తి చేశారు. 18 గ్రామాల్లో హద్దు రాళ్ల ఏర్పాటు చేపట్టి 11 గ్రామాల్లో పూర్తి చేశారు.

పథకం ముఖ్య ఉద్దేశం..

భూ రికార్డులు తారుమారయ్యే పరిస్థితిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా భవిష్యత్తులో ఎవరూ రికార్డులను తారుమారు చేయకుండా భూమికి సంబంధించిన డిజిటల్ రికార్డులను తయారు చేస్తారు. భూమి హక్కు హార్డ్ కాపీ యజమానికి జారీ చేస్తారు. భవిష్యత్తులో జరిగే అన్ని లావాదేవీలను సురక్షితం చేయడానికి ల్యాండ్ టైటిల్ కార్డులు ఆస్తి యజమాని పేరుతో ప్రత్యేక గుర్తింపు, ఫొటో, క్యూఆర్ కోడ్‌తో కలిగి ఉంటాయి. ప్రతి గ్రామం, వార్డుల వారీగా పట్టాదారుల వివరాలతోపాటు డిజిటల్ మ్యాప్‌లు కూడా సిద్ధం చేస్తున్నారు. తప్పులు లేకుండా సర్వే పూర్తి చేసిన తర్వాత సర్వే రాళ్లను సరిచేస్తారు.



రోవర్‌తో చేస్తున్న సర్వేను పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్ (ఫైల్)

పక్కాగా సర్వే చేశారు



నాకు 30 ఎకరాలు పొలం ఉంది. జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకం కింద పొలాన్ని పక్కాగా సర్వే చేశారు. హద్దు రాళ్లు కూడా ఏర్పాటు చేశారు. నాకు ఎలాంటి ఖర్చు లేకుండా సర్వే పూర్తయ్యింది. ఇందుకు కారణమైన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

– రామకృష్ణ, తీటకల్లు, బ్రహ్మసముద్రం మండలం

సంతోషంగా ఉంది



మాకున్న భూమిలో అన్నదమ్ములం భాగాలు పోయాము. నాకు 4.33 ఎకరాలు వచ్చింది. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే ద్వారా మా పొలాన్ని సర్వే చేసి హద్దు చూపించారు. ప్రస్తుతం హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. నాకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సర్వే చేయడమే కాకుండా ఉచితంగా హద్దు రాళ్ల ఏర్పాటు చేస్తుండడం సంతోషంగా ఉంది.

– దొక్కా రామచంద్ర, గాండ్లపర్తి, రాప్తాడు మండలం

వేగవంతంగా సమగ్ర సర్వే



వైఎస్సార్–జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద జిల్లాలో పకడ్బందీగా సర్వే చేపట్టాము. తొలిదశలో 43 గ్రామాల్లో సమగ్ర సర్వేతో పాటు హద్దు రాళ్ల ఏర్పాటు పూర్తయ్యింది. రెండో దశలో 57 గ్రామాల్లో సర్వే పూర్తయ్యింది. 18 గ్రామాల్లో హద్దు రాళ్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి.

– రూప్లా నాయక్, ఏడీ, సర్వే భూ రికార్డుల శాఖ

న్యూస్‌రీల్

ఏపీ ఈసెట్‌లో 'అనంత' విద్యార్థుల ప్రతిభ



బి. నెహారి చౌదరి

అనంతపురం: ఏపీ ఈసెట్ (ఆంధ్ర ప్రదేశ్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)–2023లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. అనంతపురం జిల్లాలో మొత్తం 2108 మంది విద్యార్థులు ఏపీ ఈసెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 2,020 మంది పరీక్ష రాయగా.. 1,866 మంది అర్హత సాధించారు. వీరిలో అబ్బాయిలు 1,369 (91.82 శాతం) మంది, అమ్మాయిలు 497 (93.95 శాతం) మంది ఉన్నారు.

- శ్రీ సత్యసాయి జిల్లాలో 128 మంది ఏపీ ఈసెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. 125 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 112 (89.60 శాతం) మంది అర్హత సాధించారు. అమ్మాయిలు 80 మంది దరఖాస్తు చేసుకోగా.. 76 మంది పరీక్షకు హాజరయ్యారు. 73 (96.05 శాతం) మంది అర్హత సాధించారు.

సివిల్ సర్వీసెస్ ధ్యేయం..

ఏపీ ఈసెట్ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో బి.నెహారిచౌదరి మొత్తం 200కు గాను 111 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి మూడో ర్యాంకు దక్కించుకున్నారు. అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ విభాగంలో డిప్లొమా పూర్తి చేశారు. అమ్మా,నాన్న కవిత, బి.ప్రసాద్ స్ఫూర్తితోనే ఇంజినీర్ కావాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు నెహారి చౌదరి పేర్కొన్నారు. నాన్న ప్రస్తుతం వ్యాపారం చేస్తున్నారని, అమ్మ హంద్రీ–నీవా ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ సాధించాలనే ఆశయంతో ఉన్నానన్నారు.

రూపుదిద్దుకున్న అత్యాధునిక భవనం

- రేపు ప్రధానిచే ప్రారంభం



సాయిహీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నిర్మించిన సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవం మంగళవారం జరగనుంది. ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ప్రశాంతి నిలయంలో జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించేందుకు వీలుగా సుమారు రూ.15 కోట్లతో ఈ భవనాన్ని నిర్మించారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ కార్యకలాపాలను ఒకేసారి 1,300 మంది ఆశీనులై వీక్షించవచ్చు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మితమైన భవనాన్ని నేటి ఉదయం 10.28 గంటలకు ప్రధాని ప్రారంభించనున్నారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సైతం పాల్గొననున్నారు.

డిగ్రీ కళాశాలల్లో త్వరలో తనిఖీలు

- జీరో అడ్మిషన్లు, కండీషన్ అఫిలియేషన్ కళాశాలల్లో సమగ్ర పర్యవేక్షణ
- గతేడాది గుర్తించిన లోపాలను సరిదిద్దుకున్నారా లేదా అనే అంశంపై విచారణ



ఎస్కేయూనివర్సిటీ ముఖద్వారం

అనంతపురం: ఎస్కేయూనివర్సిటీ అనుబంధ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, బోధనాభ్యాసన నాణ్యతా ప్రమాణాలు, అర్హత, అనుభవం గల ఫ్యాకల్టీ ఉందా? లేదా అనే అంశంపై ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ త్వరలో తనిఖీలు నిర్వహించనున్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో జీరో అడ్మిషన్లు గల కళాశాలలు, కండిషన్ అఫిలియేషన్ జారీ చేసిన కళాశాలలు లోపాలు సరిదిద్దుకుంటామని హైకోర్టుకు విన్నవించాయి. ఈ నేపథ్యంలో కొన్ని డిగ్రీ కళాశాలలకు షరతులతో కూడిన అనుమతి ఇచ్చారు. ఇందులో లోపాలు సరిదిద్దారా? లేదా? లోపాలు ఉన్నా 2023–24 విద్యా సంవత్సరానికి అనుమతి మంజూరు చేశారా? అనే అంశంపై నిర్ధారించడానికి ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నారు. ఉద్దేశపూర్వకంగా అనుమతి మంజూరు చేసి ఉంటే సంబంధిత యూనివర్సిటీ అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని జీఓలో స్పష్టం చేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో అనుబంధ డిగ్రీ కళాశాలలు 83 ఉన్నాయి. ఇందులో 7 డిగ్రీ కళాశాలల్లో జీరో అడ్మిషన్లు ఉన్నాయి. 13 డిగ్రీ కళాశాలలకు రెగ్యులర్ అఫిలియేషన్ కల్పించారు. తక్కిన 63 డిగ్రీ కళాశాలల్లో కండీషన్ అఫిలియేషన్ కల్పిస్తూ ఆయా డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు చేస్తున్నారు. ఈ క్రమంలో సంబంధిత 70 డిగ్రీ కళాశాలల్లోనూ ర్యాండమ్‌గా ప్రిన్సిపల్ సెక్రెటరీ పర్యవేక్షణ చేయనున్నారు. కళాశాలలు అప్‌లోడ్ చేసిన సమాచారం తప్పుగా ఉన్నట్లు నిర్ధారణ అయినా, సంబంధిత వర్సిటీ అధికారులు సమ్మతి నివేదికలు అనుకూలంగా ఇచ్చినా విజిలెన్స్ విచారణ నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

సీఎం పర్యటన సక్సెస్ చేద్దాం



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు మంత్రి ఉషశ్రీచరణ్ దిశానిర్దేశం

కళ్యాణదుర్గం: రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల ఎనిమిదో తేదీన సీఎం వైఎస్ జగన్ కళ్యాణదుర్గంలో పర్యటించనున్నారని, బహిరంగ సభకు రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసేలా అందరూ సమష్టిగా కృషి చేద్దామని మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఆదివారం కళ్యాణదుర్గంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, గృహ సారథులు, ముఖ్య నాయకులతో మంత్రి సమావేశమయ్యారు. కళ్యాణదుర్గం వేదికగా వాతావరణ బీమా, ఫసల్ బీమా నిధులను రైతుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తారన్నారు. దివంగత నేత వైఎస్సార్ అడుగు జాడల్లోనే ముఖ్యమంత్రి నడుస్తున్నారన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన వ్యక్తి జగనన్న అని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో మొట్టమొదటిసారిగా కళ్యాణదుర్గం రానున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. సభ విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతుల హాజరు, రవాణా, భోజన వసతి, తదితర వాటిపై క్షుణ్ణంగా చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బొమ్మన్న, ప్రభావతి, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు ఆంజనేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ రామాంజినేయులు, వైస్ ఎంపీపీ కాంతమ్మతో పాటు అన్ని మండలాల సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి..



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గౌతమి అధికారులకు సూచించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ ఆదివారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు నిర్వహించాలని సూచించారు. అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. బహిరంగ సభ వేదిక వద్ద గ్యాలరీ, సీటింగ్, పారిశుధ్య ఏర్పాట్లు సరిగ్గా ఉండాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. సౌండ్ సిస్టం, ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. హెలిప్యాడ్ నుంచి బహిరంగ సభ వేదిక వరకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. బహిరంగ సభ జరిగే ప్రదేశంలో అత్యవసర మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, 104, 108 వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. వాహనాల పార్కింగ్, బందోబస్తు ఏర్పాట్లపై ఎస్పీ వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, సబ్‌కలెక్టర్ నిశాంత్‌రెడ్డి, డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో దంచి కొట్టిన వాన




తాడిపత్రి సుంకులమ్మపాలెంలోని చర్చి సర్కిల్‌లో నిలిచిన వర్షపు నీరు

- జిల్లాలోని పలు మండలాల్లో వర్షం

అనంతపురం అగ్రికల్చర్/ తాడిపత్రి: నైరుతి రుతు పవనాల ప్రభావంతో ఆదివారం సాయంత్రం నుంచి పలు మండలాల్లో మోస్తరు నుంచి తేలిక పాటి వర్షం కురిసింది. తాడిపత్రి పట్టణ, మండల పరిధిలో సాయంత్రం నుంచి రాత్రి వరకు ఎడతెరపిలేకుండా వర్షం కురిసింది. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. మొత్తం మీద తాడిపత్రిలో 50 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక పుట్లూరు, పెద్దపప్పూరు, యల్లనూరు, యాడికి మండలాల్లో 20 మి.మీ., విడపనకల్లు, వజ్రకరూరు, గార్లదిన్నె, నార్పల, పెద్దవడుగూరు, బుక్కరాయసముద్రం, శింగనమల, కూడేరు, అనంతపురం, కణేకల్లు, పామిడి, బెళుగుప్ప తదితర మండలాల్లో ఓ మోస్తరుగా వర్షం కురిసింది. అదునులో వర్షం పడుతుండడంతో ఖరీఫ్ పంటల సాగు ఊపందుకోనుంది. కాగా రాగల రెండు రోజులు జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

నేడు గురుపౌర్ణమి



జిల్లావ్యాప్తంగా సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. షిర్డీ సాయినాథుడు విశేష పూజలు అందుకోనున్నారు. పర్వదినాన్ని వైభవంగా చేసుకునేందుకు ఇప్పటికే స్వామివారి మందిరాలు విద్యుద్దీపాలంకరణతో శోభాయమానంగా ముస్తాబయ్యాయి. – అనంతపురం కల్చరల్

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



రైతు కుటుంబానికి రూ.7 లక్షల ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు

కణేకల్లు: 'కుటుంబ పెద్దదిక్కును కోల్పోయి పిల్లలతో ఎలా బతకాలో తెలిక ఆవేదనలో ఉన్న మాకు మీ సహకారంతో సీఎం జగన్ రూ.7 లక్షల ఆర్థిక సాయాన్ని మంజూరు చేశారు.. సీఎంకు ఎప్పుడూ రుణపడి ఉంటాం' అని ఆత్మహత్య చేసుకొన్న కౌలు రైతు నాగరాజు భార్య వన్నక్క తెలిపారు. మండలంలోని బ్రహ్మసముద్రంకు చెందిన కౌలు రైతు నాగరాజు 8 నెలల క్రితం అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్యతో పాటు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య వన్నక్క కూలి పని చేసుకొంటూ పిల్లలను పోషిస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వారి కుటుంబ సమస్యను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి రూ.7 లక్షల ఆర్థికసాయం మంజూరయ్యేలా చేశారు. ఇందులో భాగంగానే ప్రొసీడింగ్ కాపీని ఆదివారం రైతు భార్య వన్నక్కకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, రాయదుర్గం ఏడీపీ లక్ష్మానాయక్, ఏఓ శ్రవణ్‌కుమార్, బ్రహ్మసముద్రం పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదరికమే అర్హత... ఇదే మా విధానం

- బి.యాలేరులో అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలిస్తాం
- మా అన్న బెదిరించారని దుష్ప్రచారం చేస్తారా?
- పేదల విషయంలో రాజకీయాలు వద్దు సునీతమ్మా
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: సంక్షేమ పథకాల అమలులో పేదరికమే అర్హత. ఇదే మా ప్రభుత్వ విధానం.. అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆత్మకూరు మండలం బి.యాలేరులో 114 మందికి ఇళ్ల పట్టాలిచ్చామన్నారు. మరో 90 పట్టాలిచ్చేందుకు స్థలం ఉందన్నారు. అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ పట్టాలిస్తామని చెప్పారు. దీన్ని టీడీపీ రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. దళితులకు కేటాయించిన ప్లాట్లను తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రద్దు చేయించి తమవాళ్లకు ఇప్పించుకున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కుమ్మరి, చాకలి, బోయ, కురుబలతో పాటు 54 మంది ఎస్సీలకు, ఇద్దరు రెడ్లకు పట్టాలిచ్చామన్నారు. తన సోదరుడు తోపుదుర్తి చందు, టీడీపీ దళిత కార్యకర్త, మా పార్టీకి చెందిన కురుబ నాగరాజు ముగ్గురు సెల్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుకున్నారన్నారు. 'మా ప్రభుత్వంలో ఎస్సీలకు పట్టాలిచ్చారు' అని టీడీపీ కార్యకర్త మాట్లాడితే... 'పట్టాలు ఇచ్చి ఉంటే ఇల్లు కూడా కట్టుకోవాలి, లేదంటే పట్టా రద్దవుతుంది. గ్రామంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టా ఇస్తారు' అని తన సోదరుడు చందు చెప్పాడన్నారు. ఈ సంభాషణలో ఎక్కడైనా పొరబాటు ఉందా అని ప్రశ్నించారు. ఈ మాటలను వక్రీకరిస్తూ బెదిరించాడంటూ ఎల్లో మీడియాలో ప్రచారం చేస్తారా? తప్పుడు కూతలు మాట్లాడతారా? కళ్లకు ఏమైనా కట్టుకున్నారా అని మండిపడ్డారు. 25 ఏళ్ల పాటు పరిటాల సునీత, ఆమె భర్త మంత్రి, ఎమ్మెల్యేగా పని చేసినా ఇళ్ల నిర్మాణాలను దోపిడీకి ఉపయోగించుకున్నారని ధ్వజమెత్తారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నిలువునా మోసగించారన్నారు. అనంతపురం రూరల్ మండలంలోనే ఇంటిపట్టాలు ఇవ్వకుండా 52 కేసులు వేశారన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రూ.3 లక్షలతో అగ్రిమెంటు చేసుకున్నా..

బి.యాలేరులోని భూమిని 2013లో రూ.3 లక్షలు చెల్లించి రైతుల నుంచి తాను అగ్రిమెంట్ చేసుకున్నానని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. 2014లో సునీత ఎమ్మెల్యే అయిన తర్వాత ఆ భూమికి పరిహారం చెల్లించకుండా పట్టాలిప్పించిందన్నారు. సునీతకు సిగ్గులేదా? మంత్రిగా ఉండికూడా నియోజకవర్గానికి 1,200 ఇళ్లు తీసుకొచ్చిందన్నారు. ఇంకా దళితులను ఎన్నిరోజులు మోసగిస్తారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఆమె కొడుక్కు ఏటిని అప్పగిచిందని, ఒక తమ్ముడికి ఆలమూరు గుట్ట, మరో తమ్ముడికి గొందిరెడ్డిపల్లి గుట్ట అప్పజెప్పిందన్నారు. చిన్న కొడుకు పేరు మీద ఉన్న సిద్దార్థ కన్‌స్ట్రక్షన్స్ చేసిన రైల్వే పనులకు కందుకూరు, జంగాలపల్లి చెరువు నుంచి మట్టిని తోలుకుని రూ.80 కోట్లు బిల్లులు చేసుకున్నారన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వందల ఎకరాల భూములు కొన్నారన్నారు.

మీరు 5 వేల ఇళ్లు కూడా ఇవ్వలేకపోయారు

సునీత, ఆమె భర్త కలిసి నియోజకవర్గానికి ఐదు వేల ఇళ్లు కూడా మంజూరు చేయించలేదని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 17వేల పక్కాగృహాలు మంజూరు చేయించామని, 10వేల దాకా ఇళ్ల పట్టాలు ఇప్పించామన్నారు.

విద్యార్థికి విషపురుగు కాటు

గుత్తి రూరల్: మండల పరిధిలోని సేవాగఢ్ గిరిజన సంక్షేమ గురుకులంలో సాయి సేవా నాయక్ అనే ఇంటర్ విద్యార్థిని ఆదివారం విషపురుగు కాటేసింది. గుత్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వార్డెన్ తెలిపారు.

చిరు ప్రోత్సాహం

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న జగన్ సర్కారు... ఒకేసారి అటు రైతుకు, ఇటు ప్రజలకు మేలు చేకూర్చేలా చర్యలు చేపడుతోంది. చిరుధాన్యాలైన రాగి, జొన్నల సాగుకు అన్నదాతలను ప్రోత్సహించడమే కాకుండా పండిన పంటను మద్దతు ధరతో కొనుగోలు చేసి ఆదాయం చేకూర్చనుంది. అలా కొనుగోలు చేసిన ఉత్పత్తులను రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయనుంది. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా అధికారులు చర్యలు వేగవంతం చేశారు. సాగు విస్తీర్ణం పెంచడమే లక్ష్యంగా రైతులను చైతన్యపరుస్తున్నారు.

- జిల్లాలో రాగి, జొన్న సాగు విస్తీర్ణం పెంపుపై ప్రభుత్వం దృష్టి
- సబ్సిడీతో విత్తనం అందించేందుకు సన్నాహాలు
- పండిన పంట మద్దతు ధరతో కొనుగోలు
- కొనుగోలు చేసిన రాగి పీడీఎస్ ద్వారా పంపిణీ
- అటు రైతుకు, ఇటు ప్రజలకు మేలు చేకూర్చేలా చర్యలు


జొన్న పంట

అనంతపురం అర్బన్: గత ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా 5,278 ఎకరాల్లో జొన్న సాగు చేశారు. రాగి 101 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుత ఖరీఫ్‌లో జొన్న 10,100 ఎకరాల్లో, రాగి 1,000 ఎకరాల్లో సాగు చేసేలా అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని.. అందుకు అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. సబ్సిడీపై జొన్న, రాగి విత్తనం రైతులకు అందించనున్నారు. సాగు లక్ష్యం మేరకు జొన్నలు 404 క్వింటాళ్లు, రాగులు 20 క్వింటాళ్లు అవసరమని అంచనా వేశారు. కొర్ర సాగునూ ప్రోత్సహించేందుకు 195 క్వింటాళ్ల విత్తనం అవసరమని లెక్కగట్టారు.

కర్ణాటక నుంచి కొనకుండా..

ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు రాగులు, జొన్నలను ఉచితంగా అందించే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల శ్రీకారం చుట్టింది. జిల్లాలో 6.54 లక్షల కార్డులు ఉన్నాయి. వీటికి 650 టన్నుల రాగులు, 650 టన్నుల జొన్నలు ప్రతి నెలా ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాగులను కర్ణాటక రాష్ట్రం నుంచి, జొన్నలను ఇతర జిల్లాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. అలా కాకుండా జిల్లాలోనే రైతులతో జొన్నలు, రాగులు సాగు చేయించి, కొనుగోలు చేయాలని నిర్ణయించారు. జొన్నలు క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.3,180, రాగులకు కనీస మద్దతు ధర రూ.3,846 సర్కారు ప్రకటించింది. రైతులు తాము పండించిన జొన్నలు, రాగులు అమ్ముకునేందుకు దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు. ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించాల్సిన పనిలేదు. పండించిన పంటను పూర్తిగా కనీస మద్దతు ధరతో ప్రభుత్వమే రైతు వద్దకే వెళ్లి కొనుగోలు చేయనుంది. రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చాలనే ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా రాగి, జొన్న సాగును ప్రోత్సహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. మండలస్థాయిలో, ఆర్‌బీకే పరిధిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు.

ఖరీఫ్‌లో రాగి, జొన్న సాగు లక్ష్యం ఇలా

పంట రకం	ఎకరాలు	విత్తనం (క్వింటాళ్లలో)
జొన్న	10,100	404
రాగి	1,000	20

క్వింటాలుకు కనీస మద్దతు ధర ఇలా

జొన్న	రూ. 3,180
రాగి	రూ. 3,846


రాగి పంట


కొర్ర పంట

క్లుప్తంగా

శ్రీనివాస గ్యాస్ట్రో హాస్పిటల్ ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ డీ నాగేశ్వరరెడ్డి

అనంతపురం క్రైం: వైద్య రంగంలో వస్తున్న నూతన పద్ధతులు, విధానాలతో లివర్ కేన్సర్, తదితర సమస్యలను 90 శాతం నయం చేయవచ్చని పద్మభూషణ్, ఏఐజీ హాస్పిటల్ చైర్మన్, చీఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డీ నాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం సాయినగర్ 7వ క్రాస్‌లో ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు రజనీష్‌రెడ్డి ఏర్పాటు చేసిన శ్రీనివాస గ్యాస్ట్రో అండ్ లివర్ హాస్పిటల్‌ను నాగేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. పిత్తనాళంలో రాళ్లు, కేన్సర్‌ను తొలగించి స్టంట్ ఏర్పాటు చేసేందుకు ఉపయోగపడే ఈఆర్‌సీపీ పరికరం, తదితర విభాగాలను ఆయన పరిశీలించారు. అనంతరం నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో లివర్‌కు సంబంధించి ప్రత్యేక హాస్పిటల్‌ను అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు రజనీష్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు సాధారణ ఫీజులతో ఉత్తమ వైద్యాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఈఆర్‌సీపీ పరికరం ద్వారా పిత్త నాళాల్లో రాళ్లు, కేన్సర్లను తొలగించి స్టంట్ వేస్తామన్నారు. అనంతరం రాష్ట్ర వైద్య మండలి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌వీకే ప్రసాదరెడ్డి పద్మభూషణ్ నాగేశ్వరరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్లు విజయచంద్రారెడ్డి, పద్మావతమ్మ, శ్రీవిద్య, శ్రీకాంత్‌రెడ్డి, రామస్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి


పక్కీరప్ప (ఫైల్)

పెద్దవడుగూరు: మండల పరిధిలోని క్రిష్టిపాడుకు చెందిన పక్కీరప్ప (52) పాము కాటు గురై చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాల్లోకెళితే... నాలుగు రోజుల క్రితం పక్కీరప్ప కట్టెలు కొట్టడానికి కూలి పనికి వెళ్లారు. ఈ సమయంలో పాము కాటు వేసింది. పక్కీరప్ప గమనించకుండా పని పూర్తి చేసుకొని ఇంటికి వచ్చారు. అనంతరం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం గుత్తికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

శ్రమకు మారుపేరు ఈడిగ కులస్తులు

- 'ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం'లో వక్తలు


విద్యార్థికి ప్రతిభా అవార్డు అందజేస్తున్న శివసాయిబాబా, రమేష్‌గౌడ్ తదితరులు

రాప్తాడురూరల్: కష్టం, శ్రమకు మారుపేరు ఈడిగ (గౌడ) కులస్తులు అని వక్తలు అభిప్రాయపడ్డారు. 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చాటిన ఈడిగ కుల విద్యార్థులకు గౌడ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 'ప్రతిభా పురస్కారాలు' అందజేశారు. అనంతపురం నగర శివారులోని రేణుకాయల్లమ్మ ఆలయం ఈడిగ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గౌడ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గండ్లూరి నాగభూషణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన శివసాయి బాబా, బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రమేష్‌గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని కిరణ్ కుమార్‌గౌడ్, రిటైర్డ్ సీటీఓ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ కేవలం కులవృత్తిపైనే ఆధారపడటంతో సమాజంలోనే అత్యంత వెనుకబడి ఉన్నామన్నారు. చదువు లేని వారికి ఎంత ఆస్తిపాస్తులు ఉన్నా ప్రయోజనం లేదన్నారు. తక్కిన కులాలకు గౌరవం ఇస్తూనే ఈడిగ కులస్తులు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. ఇవన్నీ కూడా చదువుతోనే సాధ్యమన్నారు. అనంతరం విద్యార్థులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో గౌడ ఉద్యోగ సంఘం దంపెట్ల గోపినాథ్‌గౌడ్, రిటైర్డ్ ఈఈ హరిబాబుగౌడ్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు ఆదినారాయణగౌడ్, నాయనపల్లి రాజు, నాగేశ్వరరావు, కొడవండ్ల వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే ప్రతిపక్షాల దుష్ప్రచారం

- తప్పుడు రాతలు రాయడమే ఈనాడు, ఏబీఎన్ పని
- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ధ్వజం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ (విడపనకల్లు): 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేదవారికి అందుతున్న సంక్షేమం చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయి.. దీన్ని ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా తిప్పికొట్టాలి' అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరులో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం తర్వాత ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం చేస్తుంటే ప్రతిపక్ష టీడీపీ ఉనికి కోల్పోతామన్న భయంతో ఈనాడు, ఏబీఎన్, టీవీ5 లాంటి ఎల్లో మీడియాలో పచ్చి అబద్ధాలతో తప్పుడు వార్తలు రాయిస్తోందని ధ్వజమెత్తారు. ఎల్లో మీడియాకు ధైర్యం, చిత్తశుద్ధి ఉంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో తమతో పాటు పాల్గొనాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యేగా గెలిచి ఇప్పటి వరకు ప్రజలకు అందుబాటులో లేకుండా వారి సమస్యలు తెలుసుకోకుండా ఉన్న పయ్యావుల కేశవ్‌ను ఏనాడూ ఎల్లో మీడియా ప్రశ్నించిన పాపాన పోలేదన్నారు. అమరావతికే పరిమితమై కేవలం చుట్టపు చూపుగా వస్తున్న కేశవ్ గురించి రాసే దమ్ము, ధైర్యం మీకు ఉందా అని ప్రశ్నించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో తాగునీటి విషయంలో మహిళలు తమకు విజ్ఞప్తి చేస్తుంటే దాన్ని పట్టుకొని అడ్డుకున్నారు.. నిలదీశారంటూ తప్పుడు కథనాలు రాయడం సరికాదన్నారు.

టీడీపీ బస్సు యాత్ర అట్టర్ ఫ్లాప్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: 'భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో టీడీపీ నాయకులు చేస్తున్న బస్సుయాత్ర ఉమ్మడి అనంతపురం జిల్లాలో అట్టర్‌ఫ్లాప్ అయింది.. టీడీపీకి, ఆ పార్టీ నాయకులకే భవిష్యత్తు లేదు.. ఇక వాళ్లు ప్రజల భవిష్యత్తుకు ఏం గ్యారెంటీ ఇస్తారు?' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఎద్దేవా చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో అనుబంధ సంఘాల అధ్యక్షులతో కలసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీ చేపడుతున్న బస్సు యాత్రకు ప్రజల్లో ఆదరణ కరువైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక, మరోసారి ఓడిపోతామని తెలిసే ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు బస్సుయాత్ర చేపట్టారన్నారు. టీడీపీ ఎన్ని కుట్రలు, మోసాలు చేసినా మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఇదే విషయం టైమ్స్‌నౌ సర్వేలో కూడా తేలిందన్నారు. ఉమ్మడి అనంత జిల్లాలో 14 నియోజకవర్గాలు, రెండు పార్లమెంట్ స్థానాలను మరోసారి కైవసం చేసుకోబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను సీఎం జగన్ 99 శాతం అమలు చేశారన్నారు. 2014కు ముందు టీడీపీ 650 హామీలతో తీసుకువచ్చిన మేనిఫెస్టోలో ఒక్క హామీను నెరవేర్చలేదని విమర్శించారు.

టీడీపీ నాయకులకు సిగ్గుందా?

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరోసారి ప్రజలను వంచన చేసేందుకు తప్పుడు మేనిఫెస్టోతో ముందుకు వచ్చిన టీడీపీ నాయకులకు సిగ్గుందా? అని పైలా నరసింహయ్య మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నారని, ఎవరికైనా సాంకేతిక కారణాలతో పథకాలు మిస్ అయింటే వారికి పథకాలు వర్తింపజేసేందుకే 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేష్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ఏం చేస్తారో తెలియజేయకుండా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యంగా చేసుకుని నోటికొచ్చినట్లు విమర్శలు చేస్తున్నారన్నారు. జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు చౌకబారు రాజకీయాలు చేస్తున్నారన్నారు. 40 ఏళ్ల పార్టీ అయిన టీడీపీ అధికారం కోసం పొత్తుల కోసం వెంపర్లాడే దౌర్భాగ్య స్థితిలో ఉన్నారన్నారు. ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకేం చేసింది లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో రూ.వందల కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎగ్గుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఐహెచ్‌ఆర్‌సీ ఇండియా అధ్యక్షుడిగా జిల్లా వాసి


వీ పురుషోత్తంరెడ్డి

అనంతపురం క్రైం: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ (ఐహెచ్‌ఆర్‌సీ) ఇండియా బోర్డు అధ్యక్షుడిగా జిల్లాలోని ప్రసన్నాయపల్లికి చెందిన వీ పురుషోత్తంరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఐహెచ్‌ఆర్‌సీ ప్రధాన కార్యదర్శి అయ్‌నుల్ హొస్సైన్ ప్రకటించారు. ఐహెచ్‌ఆర్‌సీ భారతదేశ బోర్డు అధ్యక్షుడిగా నియమితులైనందుకు చాలా సంతోషంగా ఉందని, మానవ హక్కుల కోసం తన వంతు కృషి చేస్తామని ఆయన 'సాక్షి'కి తెలిపారు.

ఆస్పత్రికి తరలిస్తుండగా గర్భిణీ ప్రసవం


ప్రసవం అనంతరం బిడ్డను చూస్తున్న కుటుంబ సభ్యులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మండలం పాలవాయి– భట్టువాని పల్లి గ్రామాల మధ్యలో ఓ ప్రైవేట్ వాహనంలో నిండు గర్భిణి మగ బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకెళితే.. కళ్యాణదుర్గం మండలం మౌక్తికాపురం (ములకన్న కొట్టాల)కు చెందిన తస్లీమ్ అనే మహిళకు ఆదివారం ఉదయం పురిటి నొప్పులు వచ్చాయి. 108 కు కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. అయితే అప్పటికే రాయదుర్గం నియోజకవర్గంలో ఓ కేసుపై వెళ్లిన 108 వాహనం తిరిగి వచ్చేందుకు ఆలస్యం అవుతుందని 108 సిబ్బంది సమాధానం ఇచ్చారు. అంతటి వరకు వేచి ఉండక తస్లీమ్ కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ వాహనాన్ని బాడుగకు తీసుకుని కళ్యాణదుర్గంకు బయలుదేరారు. భట్టువానిపల్లి– పాలవాయి గ్రామాల మధ్యకు రాగానే తస్లీమ్‌కు నొప్పులు అధికం కావడంతో రోడ్డు పక్కన వాహనాన్ని ఆపారు. తస్లీమ్ మగ బిడ్డకు జన్మనిచ్చింది.

ఉదారతను చాటుకున్న ఉపాధ్యాయుడు..

వెంకటంపల్లి తండా నుండి కళ్యాణదుర్గం వైపు వస్తున్న ఉపాధ్యాయుడు బద్దేనాయక్ తన వాహనాన్ని ఆపి జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. ఫోన్లో వైద్య సిబ్బందితో మాట్లాడారు. బిడ్డకు పుట్టిన వెంటనే ఇంజెక్షన్లు వేయాలని సూచించడంతో ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తన వాహనంలో తల్లీబిడ్డను ఎక్కించుకుని కళ్యాణదుర్గం ఆర్టీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు బద్దే నాయక్‌కు తస్లీమ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉండటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న తోటి ఉపాధ్యాయులు బద్దేనాయక్‌ను అభినందించారు. బద్దే నాయక్ ప్రస్తుతం శెట్టూరు మండలం మాకొడికి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నారు.

విడపనకల్లు రిపోర్టర్‌పై దాడి

ఉరవకొండ: విడపనకల్లు మండలం 'సాక్షి' దినపత్రిక రిపోర్టర్ సుంకన్నపై ఓ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... ఆదివారం విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని కవర్ చేయడానికి రిపోర్టర్ సుంకన్న అక్కడికి వెళ్లారు. ఈ నేపథ్యంలో మద్యం మత్తులో ఉన్న అదే గ్రామానికి చెందిన కరెంట్ తిమ్మప్ప కుమారుడు రాజు రిపోర్టర్ సుంకన్నపై దాడి చేశాడు. రెండేళ్ల క్రితం దినపత్రికలో వచ్చిన వార్త గురించి ప్రస్తావిస్తూ వాదనకు దిగాడు. కులం పేరుతో దూషిస్తూ విచక్షణ రహితంగా కొట్టాడు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ రిపోర్టర్ సుంకన్నను ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ఇదిలా ఉంటే ఉరవకొండ రూరల్ సీఐ శేఖర్, కూడేరు ఎస్ఐ సత్యనారాయణ అరగంటలోపే నిందితుడు రాజును అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. గాయపడ్డ రిపోర్టర్ సుంకన్నను మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పరామర్శించారు.

టీడీపీ భవిష్యత్‌కు 'గ్యారంటీ' ఏదీ?

- బస్సుయాత్రకు ప్రజాస్పందన కరువు
- దిక్కుతోచని స్థితిలో తమ్ముళ్లు
- గార్లదిన్నెలో కార్యక్రమానికి టీడీపీ ఇన్‌చార్జ్ డుమ్మా!


ఇల్లూరులో జనం లేక వెలవెలబోతున్న బస్సుయాత్ర

గార్లదిన్నె: ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీడీపీ ఆధ్వర్యంలో జరుగుతున్న 'భవిష్యత్‌కు గ్యారంటీ' అట్టర్ ఫ్లాప్‌గా మారింది. ఆ పార్టీ నాయకులతో పాటు జనం నుంచి కూడా స్పందన లేకపోవడంతో టీడీపీ భవిష్యత్‌కే గ్యారెంటీ లేదని ప్రజలు అంటున్నారు. గార్లదిన్నె మండల పరిధిలోని ఇల్లూరులో ఆదివారం టీడీపీ ఆధ్వర్యంలో చేపట్టిన భవిష్యత్‌కు గ్యారెంటీ బస్సుయాత్రకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రావణితో పాటు ఆమె వర్గం నాయకులు, కార్యకర్తలు హాజరు కాలేదు. దీంతో టీడీపీకి భవిష్యత్తు ఏది అని బహిరంగంగానే ప్రజలు గుసగుసలాడుకున్నారు.

చికెన్, మందు ఏర్పాటు చేసినా...

షెడ్యూల్ ప్రకారం ఉదయం 10 గంటలకు భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం జరగాల్సి ఉంది. అయితే జనం రాకపోవడంతో ఆలస్యంగా మధ్యాహ్నం 12.30 గంటలకు బస్సుయాత్ర ప్రారంభమైంది. టీడీపీ నాయకులు బస్సుయాత్రకు వాహనాలు సమకూర్చిన జనం రాకపోవడంతో బస్సుయాత్ర కాస్తా తుస్సు యాత్రగా మారింది. టీడీపీ నాయకులు నామమాత్రంగానే కార్యక్రమాన్ని జరిపించి మమ అనిపించారు. కార్యక్రమానికి వచ్చిన వాళ్లకు చికెన్, మందు ఏర్పాటు చేసినా పెద్దగా స్పందన లేకపోవడంతో ఆ పార్టీ నాయకులకు దిక్కుతోచని పరిస్థితి.

ఆధిపత్య పోరుతోనే..

టీడీపీలో నాయకుల మధ్య ఆధిపత్య పోరు మరోసారి బయట పడింది. శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే స్థానం ఎస్సీలకు రిజర్వ్ చేసినప్పటికీ టీడీపీలో అగ్ర కులాల ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలోనే పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రావణి గైర్హాజరైనట్లు సమాచారం. బస్సు యాత్రకు స్థానిక టీడీపీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా ఎక్కడా శ్రావణి ఫొటో లేకపోవడం గమనార్హం. అలాగే కల్లూరు వైఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో కూడా జనం లేక వెలవెలబోయింది.

ట్రాక్టర్ బోల్తా .. దంపతుల దుర్మరణం

బొమ్మనహళ్: మండల పరిధిలోని నక్కలపల్లి వద్ద ట్రాక్టర్ బోల్తా పడటంతో పొలం పనులకు వెళ్తున్న రైతు దంపతులు ఈశ్వర్‌రెడ్డి (46), సువర్ణమ్మ (38) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. నక్కలపల్లికి చెందిన ఈశ్వర్‌రెడ్డి, సువర్ణమ్మ దంపతులు ఆదివారం ట్రాక్టర్‌కు గుంటకను అమర్చుకొని పొలం పనులకు బయలు దేరారు. గ్రామ సమీపంలో ఎర్ర వంక పక్కనే ఉన్న రహదారిపై ట్రాక్టర్ అదుపుతప్పి వంకలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతులకు కుమారుడు పునీత్‌రెడ్డి, కుమార్తె సుమనశ్రీ ఉన్నారు. వారు 6, 8 తరగతి చదువుతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. వారి మృతితో నక్కలపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుని తల్లి తిప్పమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణయ్య తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే విశ్వ సంతాపం..

రైతు దంపతుల మృతి విషయం తెలియగానే మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి చేరుకొని ఈశ్వర్‌రెడ్డి, సువర్ణమ్మ మృతదేహాల వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీసీసెల్ జిల్లా అధ్యక్షులు సీపీ వీరన్న తదితరులున్నారు. ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి కూడా బాధిత కుటుంబానికి ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



ఈశ్వర్‌రెడ్డి, సువర్ణమ్మ (ఫైల్)


రైతు దంపతుల మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పంచామృతాభిషేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

కనగానపల్లి (ఆత్మకూరు): ఆత్మకూరు మండలంలోని పంపనూరులో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం భక్తులు పంచామృతాలతో అభిషేక పూజలు నిర్వంచారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేక అలంకరణ చేసి ఆకుపూజ, మహానైవేద్యం, పల్లకీ సేవ, మహా మంగళహారతి పూజలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి స్వామిని దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా కొందరు భక్తులు కుజదోషం, కాలసర్పదోష నివారణకు సుబ్రమణ్యస్వామికి మూతమంత్ర భీజాక్షర హోమాన్ని నిర్వహించారు. ఈ పూజలలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు ఈఓ అక్కిరెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

120 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

అనంతపురం సిటీ: అనంతపురం రెండో రోడ్డులోని మసీద్-ఏ-బహుద్దీన్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గుండె వైద్య శిబిరం నిర్వహించారు. కిమ్స్ సవీరా హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది శిబిరానికి వచ్చిన వారిని పరీక్షించారు. దాదాపు 120 మందికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. మసీద్ ముతవల్లి ఫరీదుద్దీన్, మసీద్ సెక్రటరీ పర్వేజ్, ట్రెజరర్ షబ్బీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ టీచర్లనే నియమించండి



విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం అందిస్తున్న గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు

రాప్తాడురూరల్: ఎంఈఓ-2 పదోన్నతులు పొందిన ఎస్టీ హెచ్‌ఎంల స్థానాలను ఎస్టీ స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం విద్యాశాఖ ఏడీ కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందించారు. గిరిజన ఉపాధ్యాయ సంఘం అనంతపురం, సత్యసాయి జిల్లాల ప్రధానకార్యదర్శులు డెగావత్ రవీంద్ర నాథ్, గోపాల్‌నాయక్ మాట్లాడుతూ నాలుగైదేళ్లుగా అడక్వసీ పేరుతో హెచ్‌ఎం ప్రమోషన్లలో ఎస్టీలకు ఇవ్వలేదన్నారు. ఈరోజు ఎంఈఓ-2 స్థానాల్లో ఖాళీ పడిన ఎస్టీ ఖాళీల్లో ఎస్టీ ఎస్‌ఏలతోనే భర్తీ చేయాలని కోరారు.

నేడు 'జగనన్న సురక్ష' కార్యక్రమం

అనంతపురం క్రైం: నగరంలో సోమవారం పలుచోట్ల జగనన్న సురక్ష క్యాంపులు జరగనున్నాయి. 30,31,37 సచివాలయాలకు సంబంధించి సాయినగర్‌లోని 30వ సచివాలయంలో, వినాయకనగర్‌లోని 3వ సచివాలయంలో జగనన్న సురక్ష క్యాంపులు జరగనున్నాయి. గత నెల చివరి వారంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు జగనన్న సురక్ష క్యాంపులో నమోదు చేసిన సేవలకు సోమవారం అధికారులు పరిష్కారం చూపనున్నట్లు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు.

జేసీ సమక్షంలో నైపుణ్య పరీక్ష



నైపుణ్య పరీక్షను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

రాప్తాడురూరల్: ఉమ్మడి జిల్లాలోని కేజీబీవీల్లో ప్రిన్సిపాల్, సీఆర్టీ అభ్యర్థులకు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆధ్వర్యంలో ఆదివారం నైపుణ్య పరీక్ష నిర్వహించారు. కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, సీఆర్టీ పోస్టులకు దరఖాస్తు చేసుకుని నైపుణ్య పరీక్షకు ఎంపికైన పీజీటీ (పీఎస్‌టీటీ, ఏటీఅండ్‌టీ, జీఏఫ్‌సీ, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ) సబ్జెక్టుల అభ్యర్థులకు స్థానిక రాజేంద్ర మున్సిపల్ స్కూల్‌లో నైపుణ్య పరీక్ష నిర్వహించారు. ఒక్కో అభ్యర్థిని తరగతి గదిలోకి పిలిపించి విద్యార్థులకు బోధించే తీరును జేసీతో పాటు డీఈఓ సాయిరాం పరిశీలించారు. అలాగే సోమవారం సీఆర్టీ ఇంగ్లిష్, హిందీ, గణితం, బయాలజికల్ సైన్స్ సబ్జెక్టులతో పాటు ప్రిన్సిపాల్ పోస్టుల అభ్యర్థులకు స్థానిక సైన్స్ సెంటర్‌లో నైపుణ్య పరీక్ష ఉంటుందని డీఈఓ సాయిరాం తెలిపారు. ఆయా అభ్యర్థులు విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాలు, ఇతర పత్రాలు తీసుకొని 10 గంటలలోపు చేరుకోవాలని తెలిపారు.

ట్రాఫిక్‌పై ఫోకస్



ట్రాఫిక్ పోలీసు స్టేషన్

- అనంత నగరంలో ఆరు బ్లాక్ స్పాట్లు గుర్తింపు
- వారానికో స్పెషల్ డ్రైవ్‌తో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు
- 8 ట్రాఫిక్ సమస్యలున్న రహదారులు
- ప్రతి స్పీడ్ బ్రేకరుకూ బ్లింకర్స్ ఏర్పాటు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంత ట్రాఫిక్ పోలీసులు సమస్యలపై ఫోకస్ పెట్టారు. ప్రమాదాలను నియంత్రించేందుకు వ్యూహాత్మక చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా జిల్లా కేంద్రంలో ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించారు. ఆరు బ్లాక్ స్పాట్లు గుర్తించి, ఆయా ప్రాంతాల్లో తిరిగి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రధానంగా 44వ జాతీయ రహదారి సర్వీసు రోడ్డు డీమార్టు వద్ద పదుల సంఖ్యలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది చనిపోయారు. ఇక్కడ ఆ పరిస్థితి పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నారు. మార్టు యాజమాన్యంతో మాట్లాడి కఠినమైన ఆంక్షలతో కూడిన నిబంధనలు అమలు చేస్తున్నారు. మార్టు యాజమాన్యం నిర్లక్ష్యాన్ని కూడా గుర్తించిన పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించి ప్రమాదాలను కట్టడి చేయనున్నారు. నేషనల్ పార్కు వద్ద ఉన్న వంతెన వద్ద కూడా సిగ్నల్స్ మార్చి ప్రమాధాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. సైపుల్లా వంతెన వద్ద ట్రాఫిక్ సిబ్బందిని ఉంచి వాహనాల మళ్లిస్తున్నారు.



ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై సూచనలిస్తున్న డీఐజీ

పాతూరు ప్రధాన రహదారుల్లో సమస్య: వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిన పాతూరు ప్రధాన రహదారులపై అనంతపురం రేంజ్ డీఐజీ స్వయంగా రంగంలోకి దిగారు. ఇరుకైన వీధుల్లో పాదచారులు, వాహనదారుల రాకపోకలకు అంతరాయం కలగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు. సప్తగిరి సర్కిల్ నుంచి సమస్య ఉత్పన్నమవుతున్నట్లు పోలీసులు గుర్తించారు. భారీ వాహనాల రాకపోకలను ఇప్పటికే నియంత్రించారు. గాంధీరోడ్డుతో పాటు తిలక్‌రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు.

తగ్గిన ప్రమాదాలు..: గతంలో అనంతపురంలో రోజుకు నాలుగైదు రోడ్డు ప్రమాదాలు జరిగేవి. తాజాగా రహదారులు విస్తరణ తర్వాత పరిస్థితి మారిపోయింది. ఈ నెల మొత్తం కలిపితే 3 కేసులు నమోదయ్యాయి. చిన్నాచితకా ప్రమాదాలు జరిగినా ప్రాణ, ఆస్తి నష్టం కలిగించేవి జరిగే అవకాశం లేదు.

ప్రయాణం సాఫీగా సాగేలా...



అనంత రహదారులపై ప్రయాణం సాఫీగా సాగేలా ప్రణాళిక రూపొందించాం. ప్రతి వారం ఓ స్పెషల్ డ్రైవ్ పెట్టి ప్రమాదాలు నియంత్రించేందుకు కృషి చేస్తున్నాం. ప్రధానంగా జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు ఆదేశాలతో ప్రజలతో మమేకమై, వారిలో అవగాహన కల్పిస్తున్నాం. చాలా వరకు ఆటోవాలాలు, బస్సు డ్రైవర్లు, లారీ డ్రైవర్లు, అన్ని రకాల వాహనదారులతో చర్చించాం. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో వాహనాలు నడిపితే ప్రమాదాలకు చోటు ఉండదు. జిల్లా కేంద్రంలోని ప్రతి స్పీడు బ్రేకరుకూ బ్లింకర్స్ ఏర్పాటు చేయిస్తాం. వాహనాల తనిఖీల్లోనూ వినూత్నంగా త్రిపుల్ రైడింగ్ ఒక వారం, వాహనాల రికార్డుల పరిశీలన ఒక వారం.. ఇలా ప్రతి వారం ఒక కార్యక్రమం చేపడతాం. **– వెంకటేశ్‌నాయక్, ట్రాఫిక్ సీఐ**

జగన్‌పై ప్రజల్లో విశ్వాసం రెట్టింపు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: టీడీపీ నాయకులు ఎన్ని యాత్రలు చేసినా, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ప్రజల్లో విశ్వాసం పెరిగిపోతోందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని 2వ డివిజన్ బిందెలకాలనీలో రూ.1.91 కోట్ల తో చేపట్టనున్న రోడ్డు, కాలువ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అనంత భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియోజకర్గంలో సంక్షేమం, అభివృద్ధి పెద్ద ఎత్తున జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేయడంతో రోడ్లన్నీ గుంతలమయంగా, కాలువలు అస్తవ్యస్తంగా ఉండేవన్నారు. తమ ప్రభుత్వంలో కేవలం నాలుగేళ్లలో రూ.650 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి నగరం రూపురేఖలు మార్చేశామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.15 కోట్లతో పాటు నగరపాలక సంస్థ సాధారణ, ఆర్థిక సంఘం, ఎంపీ నిధులు, స్పెషల్ గ్రాంట్స్‌తో పనులు చేస్తున్నట్లు తెలిపారు. 2వ డివిజన్‌లో ఏకంగా రూ.4 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. భవానీనగర్, వినాయకనగర్ ప్రాంతాలు పాతికేళ్ల క్రితం ఏర్పడ్డాయని, కానీ ఈ నగర్‌లలో అభివృద్ధిని ఎవరూ పట్టించుకోలేదన్నారు.

బస్సు యాత్రకు స్పందన కరువు: టీడీపీ చేపట్టిన భవిష్యత్‌కు గ్యారెంటీ బస్సు యాత్రకు స్పందన కరువైందని ఎమ్మెల్యే అన్నారు. గతంలో నగరం ఎలా ఉండేది, తమ ప్రభుత్వం ఎలా అభివృద్ధి జరిగిందో గమనించాలన్నారు. గతంలో టీడీపీ నాయకులు వాళ్ల ఇళ్లకు ఎలాంటి రోడ్ల మీద వెవెళ్లారో, ఇప్పుడు ఎలాంటి రోడ్ల మీద వెళ్తున్నారో చూసుకోవాలని చురకలంటించారు. ప్రభాకర్ చౌదరి మున్సిపల్ చైర్మన్‌గా ఉండగా మాయ మాటలు చెప్పుకోవడం తప్ప చేసిందేమీలేదన్నారు. టీడీపీ హయాంలో 90 శాతం పూర్తి చేసినట్లు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. త్వరలో 2,304 మందికి టిడ్కో ఇళ్లను అందజేస్తామన్నారు. టిడ్కో ఇళ్ల కాంట్రాక్టర్‌కు టీడీపీ కేవలం రూ.4 కోట్లు చెల్లించిందని, తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.110 కోట్లతో రివర్స్ టెండరింగ్ ద్వారా పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్లు లీలావతి, సుమతి, లక్ష్మీదేవి, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, డివిజన్ కన్వీనర్ రవి పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంత

ఆక్వా రంగానికి జగన్ సర్కారు పెద్దపీట

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: ఆక్వా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీం సలీం తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలో పీఎంఎంఎస్‌వై, పీఎంఎఫ్‌ఎంఈ పథకాల కింద మత్స్యశాఖ ద్వారా మంజూరైన రాయితీతో కూడిన రూ.10 లక్షల విలువ చేసే ఫిష్ ఆంధ్రా యూనిట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కోనసీమ ప్రాంతానికి పరిమితమైన ఆక్వా రంగం ప్రస్తుతం కరువుసీమ 'అనంత' లాంటి ప్రాంతాల్లో విస్తరించడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముందుచూపేనన్నారు. ఫిష్ ఆంధ్రా కో బ్రాండ్‌తో పెద్ద ఎత్తున రాయితీలు కల్పిస్తున్నందున మత్స్యకారులు, ఈ రంగంపై ఆధారపడిన వర్గాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెడీ టూ ఈట్, రెడీ టూ సర్వ్ కింద ఇక్కడ బెస్ట్ ఫ్రెష్ ఫ్రై (బీఎఫ్‌ఎఫ్) నాణ్యమైన తాజా చేపల వంటకాలు అందుబాటులో ఉంచడం వినియోగదారులకు మేలు చేస్తుందని తెలిపారు. పీఎంఎంఎస్‌వై, పీఎంఎఫ్‌ఎంఈ కింద 60 శాతం మేర రాయితీ ఇచ్చినట్లు నిర్వాహకులు పీఎస్ హసీనా, పీఎస్ కరీముల్లా తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డీడీ డాక్టర్ కె.శాంతి, ఎఫ్‌డీవోలు హెచ్‌ఎస్ ఆసిఫ్, డి.ఫక్కీరప్ప, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.



ఫిష్ ఆంధ్ర షాప్‌లో మెటీరియల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తదితరులు

మంచి సినిమాలకు ఎప్పుడూ ఆదరణ

- నగరంలో సామజవరగమన చిత్రయూనిట్ సందడి



మీడియాతో మాట్లాడుతున్న హీరో శ్రీవిష్ణు, హీరోయిన్ మౌనిక, డైరెక్టర్ రామ్ అబ్బరాజు

అనంతపురం కల్చరల్: కుటుంబ కథా చిత్రాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుందని 'సామజవరగమన'తో మరోసారి ప్రేక్షకులు నిరూపించారని హీరో శ్రీవిష్ణు తెలిపారు. శ్రీవిష్ణు, మౌనిక హీరోహీరోయిన్లుగా రామ్ అబ్బరాజు దర్శకత్వంతో రాజేష్ దండా నిర్మించిన చిత్రం 'సామజవరగమన' జూన్ 29న విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ క్రమంలో ఆదివారం నగరంలోని గౌరి థియేటర్‌లో చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించింది. డైరెక్టర్ రామ్ అబ్బరాజు, హీరో శ్రీవిష్ణు, హీరోయిన్ మౌనిక థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి కాసేపు చిత్రాన్ని తిలకించారు. ఈ సందర్భంగా అభిమానులు హీరోహీరోయిన్లతో సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం హీరో శ్రీవిష్ణు మీడియాతో మాట్లాడుతూ తన చిత్రాలన్నీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉండటంతో అభిమానులు ఎంతో ఇష్టపడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వచ్చిన సామజవరగమన చిత్రానికి హిట్ టాక్ రావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో థియేటర్ యజమాని వెంకటకృష్ణారెడ్డి, మేనేజర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అంబటి ఆంజనేయులు ఆశయ సాధనకు కృషి

అనంతపురం టవర్‌క్లాక్: జర్నలిస్టు సంక్షేమానికి కృషి చేసిన అంబటి ఆంజనేయులు ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్ తెలిపారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో అంబటి ఆంజనేయులు సంతాప సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. జగదీష్ మాట్లాడుతూ అంబటి ఆంజనేయులు జర్నలిస్టుల సంక్షేమం కోసం చేసిన సేవలను కొనియాడారు. సీపీఎం రాష్ట్ర నేత రాంభూపాల్ మాట్లాడుతూ అంబటి ఆంజనేయులు తన వ్యక్తిగత జీవితాన్ని పక్కనపెట్టి జర్నలిస్టుల సమస్యలపై 40 ఏళ్లుగా పోరాడారన్నారు. జర్నలిస్టు ఉద్యమాలకు సీపీఎం మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు.



అంబటి ఆంజనేయులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

అరుణాచలానికి ఆర్టీసీ సర్వీసులు

గుంతకల్లు: తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలం గిరి ప్రదర్శనకు వెళ్లే ప్రయాణికుల కోసం ఈ నెల 31న గుంతకల్లు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనజర్ బి.నారాయణస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీ కింద గుంతకల్లు నుంచి అరుణాచలానికి రానుపోను పెద్దలకు రూ.1,900, పిల్లలకు రూ.1,050 ధరను నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

నగర పరిధిలో 1,974 వినతులు

అనంతపురం క్రైం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 30,31,37, 3 సచివాలయల పరిధిలోని 1,974 సేవల కోసం వినతులు వచ్చాయి. ప్రభుత్వం 11 రకాల సేవలు ఉచితంగా అందిస్తోంది. 30వ సచివాలయ పరిధిలో 538, 31 సచివాలయంలో 21, 37వ సచివాలయంలో 451, 3వ సచివాలయంలో 964 వినతులు వచ్చాయి. వీటికి సోమవారం అధికారులు పరిష్కారం చూపనున్నారు.

కమనీయం.. సీతారామ కల్యాణం

అనంతపురం కల్చరల్: తపోవనంలోని చిన్మయ జగదీశ్వరాలయంలో సీతారామ కల్యాణోత్సవం సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కనులపండువగా జరిగింది. వారం రోజులుగా భక్తిశ్రద్ధలతో జరిగిన రామాయణ సప్తాహం కల్యాణ మహోత్సవం ముగిసింది. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త సాయి అన్నాజీ రామాయణంలోని వివిధ కాండాలలోని ప్రధాన ఘట్టాలను వివరించారు. చిన్మయామిషన్ జిల్లా ఇన్‌చార్జ్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి రామాయణ విశిష్టతను తెలిపారు. కల్యాణోత్సవం అనంతరం మహామంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం జరిగాయి. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, ఎన్‌వైకే డీడీవో శ్రీనివాసులు, విజయ్‌కుమార్, జీఎల్‌ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుపై దాడికి ఖండన

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: విడపనకల్లు మండలం పాల్తూరులో జర్నలిస్టు సుంకన్నపై ఆదివారం జరిగిన దాడిని ఐజేయూ సభ్యుడు బడా శ్రీనివాసరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోకన్వీనర్ బడిగి మంజునాథ్ ఖండించారు. దాడిచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఎస్పీ శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు వారు వినతిపత్రం అందజేశారు. గతంలో ప్రచురితమైన వార్తను మనసులో పెట్టుకొని పాల్తూరుకు చెందిన రాజు పక్కాప్రణాళికతో జర్నలిస్టు సుంకన్నపై దాడికి తెగబడ్డాడని ఆరోపించారు. అలాగే శనివారం రాత్రి తాడిపత్రికి చెందిన మీడియా ప్రతినిధిపై అక్కడి టీడీపీ నేతలు సోషల్ మీడియా వేదికగా బెదిరించారని తెలిపారు. పాత్రికేయులపై దాడులు పెరిగిపోతున్నాయని, మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం టూటౌన్ పోలీసులు ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ శివరాముడు రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి, గట్టిగా హెచ్చరించారు. పద్ధతి మార్చుకొని క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. కొంత కాలంగా నగరంలో రౌడీషీటర్లు దందాలు, బెదిరింపులు, దౌర్జన్యాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందినట్లు సీఐ తెలిపారు. ప్రశాంత జీవితానికి అలవాటు పడితే సమాజంలో తగిన గౌరవం లభిస్తుందన్నారు.

యువకుడి ఆత్మహత్య

రాప్తాడు: మండలంలోని మరూరులో కత్తిబాబు (36) ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు.. కత్తిబాబు తనకున్న 5 ఎకరాలతో పాటు మరో 13 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. అందులో వేరుశనగ, అరటి, టమాట పంటలు సాగు చేశాడు. కొన్నేళ్లుగా పంటలు సరిగా పండక రూ.15 లక్షలు అప్పు చేశాడు. రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

నేత్రపర్వంగా సాయినాథుడి నగరోత్సవం



వేణుగోపాల్ నగర్‌లో సాయిబాబా గుడిలో పూజలు నిర్వహిస్తున్న మహాలక్ష్మి శ్రీనివాసులు



అశ్వ వాహనంపై సాయిబాబాను ఊరేగిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: స్థానిక వేణుగోపాల్ నగర్ షిర్డీ సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో శ్రీ సద్గురు సాయినాథ్ సేవా సమితి వారు భారీ రథోత్సవాన్ని నిర్వహించారు. విద్యుత్ దీపకాంతుల నడుమ రథం ముందు బెంగళూరు, కేరళ, తెలంగాణాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. ఓ వైపు వర్షం జోరుగా కురుస్తున్నా పలు దేవతామూర్తులు, అసుర గణాల వేషధారులు సంప్రదాయ గీతాలనాలపిస్తూ శోబాయాత్రలో సందడి చేశారు. కార్యక్రమంలో అహుడ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఆలయ కమిటీ ప్రతినిధులు రంగనాయకులు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుపౌర్ణమి

అనంతపురం కల్చరల్: తల్లి,తండ్రి తర్వాత గురువును పూజిస్తాం.. సాక్షాత్తూ పరబ్రహ్మతో సమానంగా గురువును గౌరవిస్తాం.. గురువులేనిదే జగత్తు లేదనేది సత్యం. ఇంతటి ప్రాధాన్యత ఉండే గురువును గుర్తు చేసుకునేందుకు ఒక శుభదినం కావాలి.. అదే గురుపౌర్ణమి. దీన్ని వ్యాసపౌర్ణమి అని కూడా అంటారు. సోమవారం గురు పౌర్ణమిని పురస్కరించుకొని విశేష కార్యక్రమాలతో బాబా మందిరాలు సుందరంగా ముస్తాబవుతున్నాయి. వేదవ్యాసుడు, గురుదత్తాత్రేయుడు, శ్రీ గురు రాఘవేంద్రస్వామి, షిర్డీసాయినాథుడుతో పాటు సత్యసాయి బాబా, గణపతి సచ్చిదానంద స్వామీజీ, వలీస్వామి వంటి అవధూతలెందరినో గురుసాక్షాత్కారంగా భావిస్తూ అనంత వాసులు కొలుస్తూ ఆరాదిస్తున్నారు.

ఆలయాల్లో విశేష పూజలు..

నగరంలోని ప్రసిద్ధి చెందిన ఆదిమూర్తినగర్, వేణుగోపాలనగర్, మూడోరోడ్డు, చెరువుకట్ట తదితర చోట్ల బాబా ఆలయాల్లో విశేష సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి. నవవిధ సేవల పేరుతో నిత్యాన్నదానంతో సహా అన్ని వర్గాల వారికి మందిరాలు అందుబాటులో ఉండేలా చూడడంతో సహజంగా బాబా మందిరాలు నిత్యం భక్తులతో కిటకిటలాడుతుంటాయి. గురు పౌర్ణమి రాకతో బాబా మందిరాలు ఇప్పటికే నగరోత్సవాలు, పల్లకీ సేవలు, అఖండ సాయినామ స్మరణతో మార్మోగుతున్నాయి. కనుల పండువగా సాగే సాయి దత్త వ్రతాలు, సామూహిక ప్రార్థనల్లో అనంత వాసులందరూ భాగస్వాములైన అన్నప్రసాదాన్ని స్వీకరించాలని నిర్వాహకులు జయచంద్ర చౌదరి తెలిపారు.

ప్రకృతితో మమేకమైతేనే ప్రశాంత జీవితం

అనంతపురం కల్చరల్: ప్రకృతితో మనిషి బంధాలు తెంచుకుంటున్నందు వల్లే అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అఖిలభారతీయ కార్యకారిణి సభ్యులు భాగయ్య అన్నారు. ఆదివారం ఆరెస్సెస్ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. వందలాది మంది స్వయం సేవకులు గురు ధ్వజానికి ప్రణామాలర్పించారు. అనంతరం అనేక మంది గురు సమర్పణ చేశారు. కార్యక్రమంలో నగర సంఘ చాలక్ తాళంకి లలితా ప్రసాద్, జిల్లా సంఘ చాలక్ హిమకర్, జిల్లా కార్యవాహ పుట్లూరు సుదర్శనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రికార్డు భాగస్వామ్యం



షోయబ్ మహమ్మద్‌ఖాన్



గిరినాథరెడ్డి

అనంతపురం: మల్టీడే సీనియర్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా అనంతపురం, కడప జిల్లా జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో రికార్డు నమోదైంది. స్థానిక ఆర్డీటీ ప్రధాన మైదానంలో ఆదివారం రెండోరోజు మొదటి ఇన్నింగ్స్‌లో పి. గిరినాథరెడ్డి , షోయబ్ 374 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో అనంతపురం జట్టు 570 పరుగులు సాధించి 9 వికెట్లు కోల్పోయింది. పి. గిరినాథరెడ్డి 202 పరుగులు , (279 బంతులు, 18 ఫోర్లు, 8 సిక్సర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడారు. షోయబ్ మహమ్మద్‌ఖాన్ 199 పరుగులు (208 బంతుల్లో 23 ఫోర్లు, 4 సిక్సర్లు) చేశారు. అనంతపురం జట్టు ప్రస్తుతం 361 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



విన్నర్స్‌కు చెక్కు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

శింగనమల: క్రీడల్లో గ్రామీణ యువత రాణించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. తరిమెల గ్రామంలో కంచిరెడ్డి ఫౌండేషన్ నిర్వాహకులు జెడ్పీటీసీ కంచిరెడ్డి సుధ, వైఎస్సార్‌సీపీ నేత కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గత నెల 15న ప్రారంభమైన నియోజకవర్గ స్థాయి క్రికెట్ ప్రీమియర్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్ బుక్కరాయసముద్రం , వెంకటాపురం జట్ల మధ్య జరిగింది. ఇందులో బుక్కరాయసముద్రం విజేతగా నిలిచింది. ఈసందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ బుక్కరాయసముద్రం జట్టు రూ.25,016, వెంకటాపురం జట్టుకు రూ.15,016, రోటరీపురం జట్టుకు రూ.10,016ల చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టారని జెడ్పీ చైర్‌పర్సన్ గుర్తు చేశారు. పోటీలను నిర్వహించిన జెడ్పీటీసీ కంచిరెడ్డి సుధను అభినందించారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరిష్‌కుమార్ యాదవ్, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, కంచిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కంచిరెడ్డి కరుణాకర్ రెడ్డి, ఏపీ క్రికెట్ అసోసియేషన్ మెంబర్ రాజమోహన్ రెడ్డి, సప్తగిరిరెడ్డి, రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నగేష్, నాయకుడు చెన్నకేశవులు, ఆర్గనైజర్లు రమేష్, మారుతి, కుమార్, గిరిరాజు, మల్లి, మాధవ, రవి, బాలు, హరి తదితరులు పాల్గొన్నారు.